# మంచి వార్త



# అక్షర దీపాలు వెలిగిస్తూ

**దానధర్మాలు** కోటీశ్వరులకే పరిమితమైన వ్యవహారాలని అనుకుంటాం. చాలాసార్లు కుబేరుల దాతృత్వమే ప్రచారంలోకి వస్తుంది కూడా! మామూలు మనుషులు చేసే సాయం.. సమాజం మీద ఎంతో ప్రభావం చూపితే తప్ప వెలుగులోకి రాదు. తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన రామచంద్రన్, జయశ్రీ దంపతుల సేవాతత్పరత ఈ కోవలోకే వస్తుంది. ఓ సంస్థలో మెషీన్ ఆపరేటర్‌గా పనిచేసే రామచంద్రన్ అతి సామాన్యుడు. అయితేనేం, భార్యతో కలిసి వందల మంది విద్యార్థుల తలరాతను మారుస్తున్నాడు. ఆలూమగలు కలిసి ఐదేండ్లుగా అణగారిన వర్గాల పిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెబుతున్నారు. నెలకు వందల కొద్దీ రూపాయలు వెచ్చించి ప్రైవేటు చెప్పించుకునే స్తోమత లేని విద్యార్థులను చూసినప్పుడు వారి మనసు తరుక్కుపోయేది. తమవంతుగా ఏదైనా చేయాలనే ఆలోచన వచ్చింది. అలా, 2018లో 'కోవై తోళమ్మాయ్ అరక్కట్టలాయ్' స్థాపనతో రవిచంద్రన్ దంపతుల విద్యాదానం మొదలైంది. మొదట్లో ఆరోతరగతి వరకే చెప్పేవాళ్లు. తాజాగా ఆ సేవలను తొమ్మిదో తరగతి వరకు విస్తరించారు. ఇప్పటివరకు 250 మంది విద్యార్థులు వీరి సేవలు అందుకున్నారు. అందులోనూ, ఎక్కువమంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బలహీనవర్గాల విద్యార్థులే. కోయంబత్తూర్‌లోని ఒలింబస్ ప్రాంతంలో ఓ దేవాలయం పైకప్పును ట్యూషన్ సెంటర్‌గా ఎంచుకున్నారు. దీనికోసం నెలకు రూ. 3,500 అద్దె కూడా చెల్లిస్తున్నారు. ట్యూషన్ నిర్వహణ బాధ్యతలను జయశ్రీ తలకెత్తుకున్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు విద్యార్థులకు నాణ్యమైన బోధన జరుగుతుంది. ఆదివారం సెలవు. ఆవరణ అద్దె పైసలను తనకొచ్చే జీతం నుంచి చెల్లిస్తారు రవిచంద్రన్. ఈ దంపతుల సేవలు ఒక్క చదువులకే పరిమితం కాలేదు. స్తోమత లేనివారికి అంతిమ సంస్కారాల ఖర్చులు, వైద్యం ఖర్చులు కూడా భరిస్తారు. ఆ చిత్తశుద్ధి మరికొంత మందిని కదిలించింది. ఇప్పటికే ఓ పదహారు మంది నెలకు రూ. 100 నుంచి రూ. 300 వరకు రవిచంద్రన్ ట్యూషన్ సెంటర్‌కు ఆర్థికసాయం అందిస్తున్నారు. తమకున్న పరిమితుల మధ్యనే.. 'మేము సైతం ప్రపంచానికి' అనుకునే రవిచంద్రన్ దంపతుల చొరవ అందరికీ స్ఫూర్తిదాయకం.

# వైతాళికుల వాణి

నిర్మాణాత్మకమైన
కార్యాచరణ అంటూ లేని
సత్యాగ్రహం...
క్రియ లేని వాక్యం లాంటిది.

• **రామ్ మనోహర్ లోహియా**
**(భారతీయ సోషలిస్టు నాయకుడు)**

## క్యా బాత్‌హై!

